''అట్లా నవ్వుతావేం కృష్ణా? రాధ నలుపు కాదా? చామనచాయా? తెల్లగా వుంటుందా? నీకూ్కడా తెలుపంటేనే యిష్టమా?'' యీ ఆధునిక రా(బా)ధ యెవరు?

హామ్మయ్య....తలుపు వేసేశాను- ఇక ఈ రోజుకి విముక్తి. ఏమిటీ తలుపుమీద మళ్ళీ చప్పుడు. "సుందరీ....సుందరీ"....మళ్ళీ మళ్ళీ పిలుపు. కాదు కేక. బాది బాది తలుపు విరిగేలోగా తను లేవక తప్పదు.

"ఒస్తున్నా-వొస్తున్నా". కేకకి కేకే జవాబు. ఏంటి-పాలాయెందుకు- ఇదేవిటీ....ఈ రోజు! పాలలో చక్కెర తక్కువైందా- చూడాలా-నాలిక పైన చుక్క తియ్యగానే వుంది. అలాగేలేవే. పెందరాళే లేవాలా. ఇంత ప్రేమా ఈ రోజు యెందుకు చెప్మా!


లేస్తాను లేస్తాను - అబ్బా యెన్నిసార్లు చెప్పాలి. నిద్రపోతే లేస్తానా నేనంత తొందరగా మరి—కొన్ని యుగాలదాకా లేవను- అంత నిద్రపోవాలనుంది. యెందుకనో జీవితంలోని అలసట అంతా యీ చివరి నిమిషంలో అలుముకున్నట్లనిపిస్తోంది.

ఇప్పుడేం చెయ్యాలి - అన్నీ చేసే పెట్టేశాను మందే - మర్చిపోయాను డైరీ రాయాలి- వొంటరిగా గడిపిన రోజుల వేదనాభారాన్నంతా మోసిందెవరు - ఏం చెప్పుకున్నా కిమ్మనకుండా దాచుకుని మౌనంలో వోదార్పునిచ్చిందెవరు - యీ డైరీ లేకపోతే- నా అంత వొంటరిది ఈ డైరీ కాకుంటె నా నేస్తమెలా అవుతుంది. నన్ను యెవరూ చూడలేరు- నా లోపలి లోపలి పొరల్ని చూడలేరు. కాదు చూడనివ్వను.... కాదు ఎందుకూ యెక్కడా ఎవరూ నన్ను నన్నుగా చూసినవాళ్ళు—చూడాలని ప్రయత్నించిన వాళ్ళు చూడరు- ఎవరూ చూడరు. డైరీ పేజీల్ని లోపల పేజీల్లోపల నల్లటి సిరా అక్షరాల్ని-కాదు- చూస్తారు. చుంచుమొహం మామయ్య లాంటివాళ్ళు- వాళ్ళకేం పనిలేదు- ప్రపంచంలో అసహ్యకరమైన అసభ్యమైన పనులన్నీ ఒక్కసారి చేసేసి హాయిగా నవ్వుతూ దులుపుకుంటూ పోయేవాళ్ళున్నారు అందులో చుంచుమామయ్యకూడా వొకడు యెందుకు, వాళ్ళలో పందికొక్కు హెడ్మాష్టరు పాండురంగాన్ని కలపకూడదూ- అమ్మనీ, చెల్లినీ, అందరినీ, వీళ్ళందరినీ యేమైనా చెయ్యగలిగితే బావుణ్ను-

డైరీ చక్కగావుంది- తన కోసం తాను కొనుక్కొంది- తన కోసం దాచుకొంది యీ డైరీ మాత్రమే- చాలా అందంగా వుంది- అరేఁ నాన్న ఫొటో పక్కనే యేదో పురుగు వెళుతూ వుంది. యిది డైరీలోనే వుందా యింతసేపూ. ఫొటోని తింటూందేమో- పుస్తకాల్ని తినే పురుగులాగే వుంది- చిన్ని రెక్కలూ- అరేఁ ఫొటో చుట్టూ తిరుగుతోనే వుందే- దానికి మీసాలూ అవీనూ. నలిపెయ్యాలి. అబ్బ కంపు కంపు. కడిగెయ్యాలి చేతుల్ని. కంపు అంటె యిప్పట్లోలా దుర్వాసన అనే అర్థం లేదట తెలుగు మేష్టారు చెప్పేవారు- దేనికైనా వాడేవారట వాసన అనే అర్థంలో-ఈ పువ్వు యెంత కంపుగావుంది బావుంది. తమాషాగావుంది కడిగెయ్యాలి చేతుల్ని పోతుందా వాసన- పదాలతోబాటు అర్థాలూ మారుతాయి. మనుషుల్తోబాటు మనసులూనూ.

ఈ పెరటి తలుపు యింత శబ్దం చేస్తుందేవిటీ! నిశ్శబ్దంగా యేదీ జరిగేటట్లు లేదు. సబ్బు వేస్తే బావుణ్ను - యీ యింట్లో సబ్బుల్ని తినేస్తారుగావును - వొక్క రోజూ సబ్బుని పూర్తి ఆకారంతో చూసినట్లు గుర్తులేదు తనకి - తీసుకొచ్చినపుడు తప్ప.

ఆల్ ది పెర్ఫ్యూమ్స్ ఆఫ్ అరేబియా విల్ నాట్ స్వీటెన్ దిస్ లిటిల్ హాండ్- లేడీ మేక్బెత్ కదూ- పరీక్షకి చదివినట్లు జ్ఞాపకం- మరోసారి వెయ్యాలి సబ్బు — యీ వాసన వొదినట్లులేదు యీ జ్ఞాపకం చాలా చిత్రమైంది- యెన్ని గుర్తుంచుకుంటుంది మనసు - యెన్నిటిని మరిచిపోతుంది- నిజంగా మరిచిపోతుందా- యేమో యెక్కడో వుంటాయి పెద్ద షేప్‌రికార్డరు. కాదు- కంప్యూటరు- షేక్‌స్పియరా శేషప్పయ్యరా- గొప్పవాళ్ళైతే - చచ్చిపోతే మరీనూ యెంత కొట్టుకోడాలో కుక్కలు కాట్లాడుకుంటున్నట్లు- అన్ని నాటకాలూ చదవాలనుకుంది స్టడీ చెయ్యాలనుకుంది. షేక్‌స్పియర్ చిత్రించని మనస్తత్వం అంటూ లేదు అనేవారు మేష్టారు- తాను కూడా వుందా ఆ నాటకాల్లో- యెక్కడో తన మనస్తత్వంలో కొంత పోలికలు వుండే వుంటాయి- ఎందుకు చదవలేకపోయింది- తీరిక లేకపోయింది- అవసరం లేకపోయింది- అభిరుచి లేకపోయింది. ఏదీకాదు. తను తనుగా బతకలేకపోయింది- బతకనివ్వలేదు- అది తన భ్రమేమో-



# చివరిపేజీ

కె. యస్. రమణ



తనకే ధైర్యంలేదు అనుకున్నట్టు బతకటానికి- అంతేనేమో!

నూయి- తన చిన్నప్పుడు యెలాగుందో యిప్పుడూ అలాగేవుంది పెచ్చులూడిపోయి జామిచెట్టుమాత్రంయెదిగింది-తనతోబాటు ఒక్కకాయా తిననివ్వరు పక్కింటి కుర్రాళ్ళు- యెప్పుడొస్తారో- యెట్లా కాజేస్తారో-తినటానికేకదా కాయలు అవును- ఎవరు తింటేనేం-చెట్టు తినబడుతుంది కాని తినదు తనలా-

కొత్త లంగా జాకెట్టు తొడుక్కొని నూతి గట్టుమీదెక్కి దూకబోయిందికదూ తను- యెందుకు చెప్మా- అవును- అవును ఆరోజు తన పుట్టినరోజు-అమ్మ యెందుకు తిట్టింది చావుదొంగముండా అని- ఎందుకో నాన్న అప్పుడు పరిగెత్తి వొచ్చి పట్టుకున్నాడు- కళ్ళు తుడిచాడు. అమ్మని కేకలేశాడు- బాగా గుర్తుంది కొట్టబోయాడు కూడా- నాన్న చాలా మంచివాడు- నాన్నొక్కడే మంచివాడు యీ ప్రపంచంలో - నాన్న పొడుగ్గా సన్నగా కోలమొహం నాన్న- నాన్నా- యెక్కడున్నావ్.. యెక్కడున్నావ్... యిదేవిటీ యేడ్చేస్తోందీ తను- బుగ్గలమీదుగా యేవిటీ యిన్ని కన్నీళ్ళు-

అమ్మ వొస్తే బావుండదు కేకలేసుంది- అర్ధరాత్రి యేమిటా మేల్కొండాలూ. తిరగడాలూ అంటుంది- యీ అపరాత్రి యేడుపులవల్లే ఏ శుభకార్యమూ జరగలేదు అంటుంది- అన్నిటికీ తననే అంటుంది- నాన్ననీ అంటుంది- ఆ సిరి కాజేసిన నాన్న అన్నదమ్ముల్నీ అంటుంది తను అనందెవర్ని- వెళ్ళిపోవాలి-

ర్ర్ ర్ర్....శబ్దం-మళ్ళీ తను భరించలేని శబ్దం- కొన్ని శబ్దాలు విచిత్రంగా యెంత అసహ్యమో- నూనె పట్టించాలి- హమ్మయ్య గది లోవుంటే యెంతశాంతిగా వుంటుంది- శాంతి కాదేమో భద్రత- గదిలో వున్నంతసేపే ఈరాత్రి కొనసాగినంత సేపే- మళ్ళీ మామూలే-

తను అప్పుడు చచ్చిపొయ్యుంటే యేమయ్యేది- బావుండేది- అప్పుడే చచ్చిపొయ్యుంటే నాన్న తనకోసం యెంతో ఏడ్చేవాడు- యిప్పుడు చచ్చిపోతే ఏమనుకుంటారు అందరూ—ఏడుస్తారు కాని-తన కోసం కాదని తనకి నమ్మకం- బహుశా తను తెచ్చే డబ్బుకోసమేమో- తనకు ప్రతిష్ఠ తెచ్చేనని యేడుస్తుంది కాబోలు అమ్మ మరి నాన్న—తన దిగులుతో చచ్చిపొయ్యుండేవాడు నాన్న- యిప్పుడు లేడే నాన్న-మరి తను నాన్నచనిపోయి సంవత్సరాలైనా తను బతికుంది- ఆశ్చర్యంగాలేదు- ఎందుకోసం యెవరికోసం బతుకుతూ వుంది-అప్పుడు నాన్నని అందరూ తిడుతూ వుంటే నేను వస్తాను ఈ కుటుంబ పోషణ నాన్నని తిట్టకండీ అని యేడ్చింది— అరేఁ ఆ.... బల్లి— కుడికాలి మీద పడింది. శుభమా- అశుభమా- రెండూ వొకటే- రేపుదయం అందరూ యెదురుచూసే శుభం తన కశుభంలాగే కనిపిస్తుంది-

యెంతమంది చూశారు తనని-యిప్పటికి వొంటజను మందిపైగా లక్ష్మణ కుమారులు చూశారు- వయస్సు యెక్కువ-తను

## తెలుగు పుస్తకాలు

| | |
|---|---|
| 150 కుటీర పరిశ్రమలు | రు. 10-00 |
| అతివినోద హాస్యకథలు | రు. 10-00 |
| కామసూత్రాలు | రు. 10-00 |
| దాంపత్య రహస్యాలు | రు. 10-00 |
| గర్భం-గర్భనిరోధం (బొమ్మలతో) | రు. 10-00 |
| ఇంగ్లీషు వైద్యం అన్ని రోగాలకి | రు. 25-00 |

4 పుస్తకములకు పోస్టేజి ఉచితం.

ఉషా బుక్ సెంటర్,

గాంధీనగరం, తాడేపల్లి గూడెం (A. P.)

## కావలెను

శక్తి సూటింగ్‌లు, షర్టింగ్‌లు మరియు చీరల అమ్మకం మీ ఖాళీ సమయంలో పెంపొందించుటకు జీతం లేదా కమీషన్ పై నెలకు రు. 700/- సంపాదించుటకు ఏజెంట్లు కావలెను. ఉచిత సాహిత్యం మరియు శాంపిల్స్ కోసం దరఖాస్తు చేయండి.

**SHAKTI TEXTILES AGENCIES (AJ)**
**Post Box No-1138, Delhi-110 006**

ఉచితము! ఉచితము!

## తెల్లమచ్చలు

అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు.

Bharat Ayurvedashram
P.O. Katri Sarai (Gaya)

## దీర్ఘ వ్యాధులకు ఉత్తమ వైద్యం!



దురభ్యాసములకులోనై దాంపత్యసౌఖ్యంపొందలేనివారు, హెర్నియా, చర్మవ్యాధులకు పోస్టు ద్వారావరిబీజము(బుడ్డ). మూత్రవ్యాధులు, ఇస్నోఫీలియా, దమ్ము, ఉబ్బసమునకు ఆపరేషన్‌లేకుండ రండి.

డా॥ దేవర,
5/1, బ్రాడిపేట, గుంటూరు-2
బ్రాంచిలు: 26, నార్త్‌బోగ్‌రోడ్, మద్రాసు-17.
మార్వాడిగుడివద్ద, తెనాలి. ఫోన్ 551.


ముసిలిదైపోయిందా - పాతికేళ్ళకు పైబడింది కమా వయసు- మూడు పదుల్లోకి యింకో సంవత్సరన్నరలో అడుగు పెట్టబోతుందేమో — అమ్మ అంటుందెప్పుడూ యింకా పాతికేళ్ళయినా పూర్తి కాందే. చామన చాయలెండి నలుపేంకాదు- అని. నలుపు-నలుపు. ఈ చుంచు మామయ్యకి బుద్ధిలేదు. యెంతమంది సంతలో పశువుల నాణ్యాన్ని చూసినట్లు ఛీ-ఛీ ఈ పద్ధతెప్పుడు మారుతుంది- ఈ వ్యవస్థ యెప్పుడు మారుతుంది. ఇది మారదు తను-

మరీ నలుపేం కాదే తను- అట్లా నవ్వలేవేం కృష్ణా- కృష్ణా- రాధ నలుపుకాదా, చామనచాయా. మరీ తెలుపుగా వుంటుందా నీకూ కూడా తెలుపంటేనే యిష్టమా- నిజంగా రాధ అంత తెల్లగావుందా ఆర్టిస్ట్ యెవరో ఆ పొడి అక్షరాలు అర్థంకావటం లేదు. అతని ప్రేయసి అంత తెలుపుగా వుండి వుంటుంది. అంతే- అంతే- అంతే ఐవుంటుంది.

పెళ్ళి చూపులు జరిగాయటండీ— యేమైంది యేం ప్రశ్నలు అడిగారండీ? మీకు నచ్చారా అయినా ఆడవాళ్ళకి నచ్చటమేమిటి లెండి- యెంత కట్నం- కట్నం లేంది పెళ్ళెవరు చేసుకుంటారు. అందులో అమ్మాయి బావుంటే కట్నం తగ్గిస్తారేమో కాని బొత్తిగా తీసుకోని వాళ్ళెవరు వున్నారు — యిప్పటికే వయసెక్కువై పోయింది- కోరికలే గుర్రాలైతే - అయినా వోర్చుకుని వుండటం కష్టంలెండి ఇంకా ఎదిగిన చెల్లెలుకూడా వుంది పాపం- నలగానే వుంటుంది కానీ సుమారుగానే వుంటుంది. సంసారపక్షంగా ఫర్లేదు ఎత్తు పలాలకి లోటులేదు- యింకా కన్నెపిల్లగానే వుందంటారా- ప్రశ్నలు, జవాబులు, ఆశ్చర్యాలు, సానుభూతులు, నవ్వులు, వెక్కిరింతలు, హేళనలు, యింటినిండా- వీధినిండా-బడినిండా- ప్రపంచంనిండా- మనుషులు మనుషులు మనుషులు- ఛీ ఏం మనుషులు.

ఏం పొందింది తను. ఏ ఆప్యాయత, ఏ స్నేహం, ఏ ప్రేమ తననీ వొంటరితనంనుండిదిగులునుండితప్పించగల్గింది- వొంటరితనం మింగేసింది యౌవనాన్ని కోరికల్ని ఆశల్ని కొండచిలువలా-యెంత పెద్ద కొండచిలువ— వొక్కొక్కరూ వొక్కొక్క కొండచిలువై— కొండ చిలువని చిన్నప్పుడు యెప్పుడో జూలో చూసింది— భయంతో నాన్నచేయి గట్టిగా పట్టుకుని పులులు, సింహాలు, యెలుగ్గొడ్డు, ముళ్ళపందులు. పక్కన నాన్న వున్నంత వరకూ భయం లేకుండానే భయం భయంగా సరదాగా, కొంచెం వుత్సాహంగా వుద్రేకంగా- జంతువులు జంతువులు- యిప్పుడు నాన్న లేకుండా యెట్లా చూస్తోంది- మనుషుల్ని కాదు జంతువుల్ని ఈ ప్రపంచాన్ని కాదు జూని— చుంచు మామయ్య గుంటనక్క చూపుల్ని వొంటింటి యెలుగ్గొడ్డులా అమ్మ ఛీత్కారాల్ని బలిసిన సీమకుక్కలా చెల్లి ఈసడింపుల్ని జిరాఫీ మెడలో సన్నగా పొడుగ్గా సక్కింటి క్రిష్ణమూర్తి తేనె విషం నవ్వుల్ని క్రిష్ణమూర్తి- క్రిష్ణమూర్తి.

తను పుస్తకాలకోసం క్రిష్ణమూర్తి పుస్తకాల నదుముకునే గుండెల యెత్తుల కోసం చూపులు అప్పుడే విచ్చుకుంటున్న పువ్వుకోసం తుమ్మెద క్రిష్ణమూర్తి- ఛీఛీ కాదు- నాన్నని తిడతాడా అమ్మతో కలిసి నామీద అభాండాలు వేస్తాడా-నేను లొంగక పోయేసరికి- కాని ఆ స్పర్శ బావుంది— అసహ్యంగా తియ్యగా రొమ్ములమీదికి పాకిన అతనిచేతులు వెన్నెముకలోకిజారిన తిమ్మిరి రెప్పలమీదికి వాలిన మత్తు బావుంది, బాగా లేదు, ఏది బావుంది, ఏది బాగాలేదు. క్రిష్ణమూర్తా! ఆపనా! తనకి ఏం కావాలో బాగా అర్థమైన ఆ క్షణమా తననుంచి అందరూ కోరుకుంటున్నదేమిటో అర్థమైన ఆ క్షణమా- అంతేనా తనకు కావలసింది- అంతేనా తనలో ఎవరైనా కోరుకునేది— ఎవరికి అక్కర్లేగది- అందరికీ కావాలి - పందికొక్కు ముసలి హెడ్మాష్టరు పదును తగ్గని యెక్స్‌రే చూపుకీ ప్యూన్ వీరయ్య మెలేసే పోతు కోరమీసాలకీ వినాయకుని గుళ్ళో పిలక పూజారి ప్రసాదం యిచ్చేవాళ్ళకి అందరికీ కావాలి అది— అందరికీ కావాలి మరి — మంచం మీద రోగంతో తీసుకుంటున్న భార్య వున్న చుంచు మామయ్యకీ తన లాంటి అమ్మాయిని చేసుకోవాలనుందట పెళ్ళాం చచ్చిపోగానే వుండదూ మరి—

రేపుదయం అవుతుంది మళ్ళీ మధ్యాహ్నమౌతుంది. మళ్ళీ సాయంత్రమౌతుంది - నేను లేకుంటేనేం అంతా జరుగుతూనే వుంటుంది, బళ్ళో పాఠాలు జరుగుతాయి. గుళ్ళో పూజలు జరుగుతాయి— యింట్లో వంటలు జరుగుతాయి — వున్న యిల్లూ రాయించుకుని సుగుణని తన కొడుక్కిచ్చి పెళ్ళి చేస్తాడు చుంచు మామయ్య — అమ్మని తీసికెళ్ళి చాకిరీ చేయించుకుంటాడు— అందరినీ తిట్టి తిట్టి తనను అట్లా వొదిలి పోయిన నాన్నని తిట్టి, తనను తిట్టి, అలిసి పోయి ఓ రోజు చచ్చిపోతుంది అమ్మ. అప్పుడు యేడ్వటానికి తనుండదు. తనెందుకేడుస్తుంది — పాపం అమ్మ

మంచిదే. కాని అంత మంచిది కాదు — నేనంటే ప్రేమలేదు— సుగుణ అంటేనే ప్రేమ. సుగుణవన్నీ అమ్మ పోలికలే— సుగుణకీ అమ్మంటేనే యిష్టం— అమ్మ తెలుపుకాదు, సుగుణ బాగా తెలుపు అసలు తన కుటుంబంలో ఆ రంగు సుగుణకే వుంది— అమ్మను గురించి యేమేమో చెప్తుకున్నారు. కాని అమ్మ మంచిది— యెప్పుడూ యింట్లోనే వుంటుంది— బయట తిరిగి యెరగదు— ఆ తిట్లు తిట్టటం తప్పించి తనకి పెద్ద వ్యాపకాలేవీ లేవు— కాని నాన్నంటే యేమిటో చాలా కోపం చూపిస్తుంది— నాన్నకి నామీద యిష్టమని నామీదా చూపిస్తుందేమో కోపం. ఇద్దరం ఆమెకి పుట్టిన వాళ్ళమేగా- అయినా అమ్మకి సుగుణంటేనే యిష్టం తనకేమో నాన్నంటేనే యిష్టం.

అబ్బా— కాలిమీద ఎంత సేపట్నుంచీ కుడుతోందీ దోమ. దోమలకూడా ఆ వాళ్ళ రకం అంటేనే యిష్టంట. ఎక్కడో చదివింది తను దీన్ని .... వెధవ గాజు పగిలింది- రక్తం చర్మం చిట్లి-యెర్రగాజులు ఎర్రరక్తం బావుంది ఎర్రగా — ఎంత మంచివాడో నాన్న — తనకోసం అంటే యెన్ని పుస్తకాలు ఎన్ని బట్టలు ఎంత ఖర్చు చేసేవాడో నాన్న.

శారద నవ్వుతోంది. ఊర్వశి శారద- కాదు ఏడుస్తోంది- ఆమె ఏడుపే బావుంటుంది అంతేనమో కొందరికి కొన్నే బావుంటాయి. గిరిజా ఫ్యాన్సీ స్టోర్స్.... గిరిజా గిరిజా నువ్వేమిటో నీ జీవితం యిటా అయిపోయిందేం సుందరీ అని చేతులు పట్టుకుని ఏడ్చింది-తనకి ఒకే ఒక ఆప్త స్నేహితురాలు అస్సాం వెళ్ళిపోయింది మిల్ట్రీ మొగుడితో- ఒక పిల్లవాడితో. అప్పటికీ తనకి ఎవరి మీదా కోపం రాలేదు. కాని ఏడుపు వచ్చింది. ఏడుస్తూనే వీడ్కోలిచ్చింది. తనేం కోల్పోయిందో యేం పొందిందో తనకే తెలుసు-గిరిజ యేంచేస్తూ వుంటుంది? పిల్లాడిని జోకొడుతూ వుంటుంది కాదు తన్మయంగా.

తనకేం కావాలి తనకేం వొద్దు నాన్నా నాన్నా - కాదు వీళ్ళందర్నీ చంపెయ్యాలి ముక్కలుగా కసిగా నరికెయ్యాలి. యింకా యింకా వాళ్ళు యిక నన్నేం చేయగల్రు.

వుదయం వొస్తుంది అమ్మ తొరగా లేవవే లీవులెటర్ పంపించావా అంటుంది తను వినదు-

స్నానంచేసి తయారుకా ఆ జుత్తుమరీ అణిచి దువ్వుకోకుండా పల్చగా పైకి రేగినట్లు దువ్వుకో. ఆ క్రీంకలర్ చీర కట్టుకో యెర్రగాజులు వేసుకో. సుగుణ జాకిట్టు వేసుకో. యేమీ అనదులే - నేను చెబుతాలే నీవన్నీ పొడుగ్గా మరీ వొదులుగా బావుండవు వింటున్నావా తొరగా లేచి స్నానం కానిచ్చు - వాళ్ళొచ్చేస్తారు తొమ్మిదికల్లా అంటుంది.

తను వినదు-

ఈ సంబంధమన్నా కుదిరితేబావుణ్ను- లేదూ నాకు తిక్కరేగితే నిన్ను నీ మావయ్యకి అప్పజెప్పి-సుగుణని ని మామయ్య కొడుక్కిచ్చి పెళ్ళి చేసేసి - యే కాశీకి వెళ్ళిపోతాను చేతులు దులుపుకొని - యీ నిందలు నిష్టురాలు నేను భరించలేను బతికినంత కాలం భరించమని నా తలమీద కట్టి వెళ్ళిపోయాడు మి నాన్న - యింకా లేవవేమే.

తను లేవదు-

వినదు లేవదు వినదు లేవదు లేవదు వినదు- అప్పుడు యేమవుతుంది. తను యెక్కడుంటుంది- యేమవుతుంది తన ప్పుడు ఆశ్చర్యం వేసుంది తలచుకుంటే.

ఇన్నిటిని ఒక్కసారిగా మింగాలంటే కష్టంగా వుంది కాని తప్పదు. కష్టంకానిపనంటూ ఈ లోకంలో యేంలేదు. ఏంవుంది. నీళ్ళు- నీళ్ళు ఎన్ని నీళ్ళు ఏదోగా వుంది. ఈ డైరీలో ఈ పేజీలో ఏం రాయాలి — యింకా సగం వుంది. మిగిలిపోయాయి ఖాళీగా- మిగిలిపోతాయి మిగిలిపోతాయా— తను ఇక్కడితో ఆ పేజీలు కాల్చేసే ఒంచి కాల్చేస్తే తనచేతుల్లో వున్న పని తానెందుకు చెయ్యలేదు. తన్ను ఎవరూ అడ్డుపెట్టలేరు. తలుపులు వేసిందికదా- హమ్మయ్య వేసింది గొళ్ళెం మరిచిపోలేదు- తూలుతున్నట్లుంది ఒళ్ళు మత్తుగా. మొద్దుగా, ఏదోలా- చింపెయ్యనా ఈ పేజీలు- కానీ మరీ బావుంది డైరీ- ఎర్రటి పచ్చటి అక్షరాలతో రోజులతో తారీఖులతో- నాన్న కొనిచ్చేవాడెప్పుడూ- యిది తానే కొనుక్కున్నా నాన్నే కొనిచ్చినట్లనిపిస్తుంది తనకి.

కళ్ళు రెప్పలు భారంగా ఏం రాయగల్చుకొంది తను. అది గుర్తు రావటం లేదే. యేదో నిర్వేదంలా బరువుగా తేలిగ్గా యేదీ యెక్కడా? నల్లగా సంకేతాలు యెక్కడికి- తాను- యెక్కడ- నూతిగట్టు మీంచి- అయ్యో దూకేస్తోంది. నాన్నా- నాన్నా- యేడీ- యేడీ.

---

# వెయ్యేళ్ల తెలుగు పద్యం

గురుతరమైన కావ్యరస గుంభన కబ్బురమంది ముష్కరుల్
సరసులమాడ్కి సంతసిల జాలుదురోటు శశాంక చంద్రికాం
కురముల కిందుకాంత మణికోటి స్రవించిన భంగి వింధ్య భూ
ధరమున జారునే శిలలు దాశరథీ కరుణాపయోనిధీ !

—కంచర్ల గోపన్న

దురాత్ములు గొప్ప కావ్యాలలోని రస సృష్టికి, సరసులయిన వాళ్ళలాగా సంతోషించగలరా? చంద్రకిరణ స్పర్శకు చంద్రకాంత శిలల్లాగా, వింధ్య పర్వతంలోని రాళ్ళు కరుగుతాయా?

దాశరథీ శతకం ప్రసిద్ధమైనది. కవి కంచర్ల గోపన్న ఆ తర్వాత రామదాసుగా తెలుగుదేశానికి సుప్రసిద్ధుడు కావ్య సాహిత్యం ధోరణిమీద, ఆ కవుల భోగాసక్తిమీద, ఆ మధ్య యుగంలోని రాజుల, అధికారుల నిరంకుశత్వంమీద, నిరసన ప్రకటించడం మొత్తం శతక వాఙ్మయంలో కనిపించే ప్రముఖ లక్షణం. ఆ నిరసన తెల్పడానికి వాళ్ళకు దొరికిన ఆధారం, బలం, దైవభక్తి. భోగలాలసతను ఖండించి, ఆత్మతృప్తికోసం కవిత్వ రచన చేయడం ఆ దశలో వచ్చిన పరిణామం.

— శ్రుతి